క్లుప్తంగా

ఉత్తమ పంచాయతీగా రామానుజవరం

తల్లాడ: మండలంలోని రామానుజవరం గ్రామ పంచాయతీ జిల్లాస్థాయిలో ఉత్తమ జీపీగా ఎంపికైంది. బుధవారం పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రామానుజవరం పంచాయతీ పచ్చదనం పరిశుభ్రతలో మేటిగా నిలిచింది. సర్పంచ్ శీలం కోటారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు శీలం శివపార్వతి ఆధ్వర్యంలో గ్రామంలో పలు రకాల పూల మొక్కలు, పండ్ల మొక్కలు, రహదారుల వెంట చెట్లను, శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డులో పచ్చదనం పరిడవిల్లే విధంగా మొక్కలను నాటించడంతో పాటు.. పలు అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో పంచాయతీని జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ చంద్రమౌళి తెలిపారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



ఆళ్లపాడులో గొర్రెలకు టీకాలు వేస్తున్న దృశ్యం

బోనకల్: గొర్రెల, మేకలకు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి అన్వేష్ సూచించారు. మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో బుధవారం గొర్రెలు, మేకలకు ఈటి చిటికె వ్యాధి టీకాలను వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగేంద్రకుమార్, శ్రీకాంత్, నాగేశ్వరరావు, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



టీపీటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కారేపల్లి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై దృష్టి పెట్టాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్ష , కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, మల్లం హరీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం కారేపల్లి మండల వనరుల కేంద్రం వద్ద సంఘం పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రమోషన్లు, బదిలీలు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను అనుసరించి టెట్‌తో సంబంధం లేకుండా జరపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉడుగు సుధాకర్, అన్నవరపు దామోదర్, దేవరకొండ నాగభూషణం, చాగంటి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కామల్ల సుందర్, రాచకట్ల మల్లేశ్వరరావు, ఇమ్మానియేల్ రాజు, అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు దోహదం



చిత్రలేఖన పోటీల్లో సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులు

సత్తుపల్లిరూరల్: వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయని దివ్యాస్ అకాడమి వ్యవస్థాపకురాలు బి.దివ్య అన్నారు. పట్టణంలో నెలరోజుల పాటు నిర్వహించిన చిత్రలేఖన వేసవి శిబిరం ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. సామాజిక నైపుణ్యాలు పొందించుకోవటంతో పాటు సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఆటపాటలతో చిన్నారులు నేర్చుకున్న అంశాల వారీగా సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణప్రసాద్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుంత పూడ్చరూ..



పొలంలో గుంత పూడ్చని దృశ్యం

ఎర్రుపాలెం: ఇటీవల మండలంలోని బనిగండ్లపాడు-పెద్దగోపవరం గ్రామాల మధ్య రోడ్డు వెంబడి ఉన్న రైతు తల్లపురెడ్డి వెంకటరెడ్డి పొలంలో మిషన్ భగీరథ పైపు లైను లీకైన విషయం తెలిసిందే. అధికారులు లీకులకు మరమ్మతులైతే చేశారు కానీ.. గుంతను పూడ్చడం మరిచారు. ఈ విషయమై రైతు అధికారులకు తెలిపినా.. వారు స్పందించడం లేదని తెలిపాడు. పొలంలో దుక్కి దున్నాలన్నా, విత్తనాలు చల్లాలన్నా గుంట ఆటంకంగా ఉందని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాపోయాడు.

భలే.. తాటి ముంజలు

- వేసవితాపాన్ని తగ్గించేందుకు ఉపయోగం
- జాతీయ రహదారిపై జోరుగా విక్రయాలు
- రోజు కూలి కంటే ఎక్కువగానే ఆదాయం



తాటికాయల నుంచి తీసిన ముంజలు



తల్లాడ జాతీయ రహదారిపై తాటి ముంజలు అమ్ముతున్న వ్యాపారులు

తల్లాడ: వేసవి తాపాన్ని తీర్చేందుకు శరీరంలో చల్లదనాన్ని అందించేందుకు తాటిముంజలను ఎక్కువగా తీసుకుంటుంటారు. వేసవి ప్రారంభం కావడంతో తల్లాడ మండలంలో తాటి ముంజలకు భలే గిరాకీ ఏర్పడింది. ప్రతి ఏటా ఎండాకాలంలో ఈ తాటి ముంజలను కృష్ణా జిల్లా నెమలి, కల్లూరు మండలం చిన్న కొరుకొండి, తాళ్లూరు వెంకటాపురం, పెద్ద కోరుకొండి నుంచి ఆటోల్లో, ద్విచక్ర వాహనాల్లో తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తుంటారు. ఈ సంవత్సరం కూడా తాటి ముంజలను తీసుకొచ్చి జాతీయ రహదారి పక్కన ఓ చెట్టు నీడన పోసి వచ్చే పోయే వాహనదారులకు విక్రయిస్తున్నారు. తియ్యగా నోట్లో వేసుకుంటే కరిగిపోయేలా ఉండే వీటి లోపల భాగం నీరుగా ఉంటుంది. ఈ ముంజలు శరీరానికి కలిగించే చలువ వల్ల ఐస్ యాపిల్ అని కూడా అంటారు.

ఆసక్తి చూపుతున్న ముంజల ప్రియులు..

ఆరోగ్యానికి, వేసవి తాపానికి, వడదెబ్బకు ఈ ముంజలు బాగా పని చేస్తాయి. దీంతో ముంజలను కొనేందుకు జాతీయ రహదారిపై వివిధ వాహనాల్లో వచ్చే పోయే వారు. స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ముంజులను అప్పటికప్పుడే తాటి కాయల్లో నుంచి తీసీ డజను 40 నుంచి 50 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. వైరా-తల్లాడ రోడ్డు, ఏన్కూరు-తల్లాడ రోడ్డు, కల్లూరు-తల్లాడ రోడ్డులో ఈ ముంజలను గత పక్షం రోజులుగా విక్రయిస్తున్నారు, రోజుకు ఇద్దరు మనుషులు రూ.2వేలు పైగానే సంపాదిస్తున్నారు. అన్నీ ఖర్చులు పోను తమకు రెండు వేలు మిగులుతాయని విక్రయదారులు తెలిపారు.

ఆరోగ్యానికి ఎంతో మంచిది..



తాటి ముంజలు సహజ సిద్ధంగా పండేవి. తాటి చెట్ల నుంచి వేసవి కాలంలో వీటిని ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విక్రయిస్తుంటారు. ముంజల తినడం వల్ల వేసవి తాపం నుంచి బయటపడొచ్చు. వడదెబ్బకు గురికాకుండా ఉండొచ్చు. లేత ముంజల్లో నీరు బాగా ఉంటాయి. రసాయనికంగా తయారయ్యే వాటికేంటే ఇవి మంచిది.

– బండారు లక్ష్మీనారాయణ, తల్లాడ

గిరాకీ బాగుంది..



ముంజల అమ్మితే రోజుకు రూ.1,000 వరకు వస్తాయి. తాటి చెట్ల మీద ఉన్న గెలలను నరికి ఆటోలో, ద్విచక్ర వాహనంపై తీసుకొచ్చి అమ్ముతాం. రాష్ట్రీయ రహదారిపై వచ్చే పోయే వారు ముంజలను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. అన్నీ ఖర్చులు పోను మాకు కూలీ గిట్టుబాటు అవుతోంది. సీజన్‌లో వ్యాపారం బాగానే ఉంది.

– నాయుడు మురళి, ముంజల వ్యాపారి

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



చింతకాని: ఉపాధికూలీలతో మాట్లాడుతున్న జానికీరాములు

మధిర/చింతకాని: ఉపాధిహామీ కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సహాయ కార్యదర్శి తెలప్రోలు రాధాకృష్ణ, మండల కార్యదర్శి వత్సవాయి జానకీరాములు డిమాండ్ చేశారు. బుధవారం మధిరలోని కృష్ణాపురం, చింతకానిలోని బొప్పారం గ్రామాల్లో వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. గత సంవత్సరం చేసిన పనులకు కూలీలు ఇప్పటి వరకు డబ్బులు రాలేదన్నారు. తీవ్రమైన ఎండలో పనిచేసినా రోజుకూలీ రూ.200లకు మించి రావడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలీ రూ.600 ఇవ్వాలని, ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని.. లేదంటే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్, సీఐటీయూ జిల్లా నాయకులు పడకంటి మురళి, తెజవత్ నాగేశ్వరరావు, బుక్యా నాగేశ్వరావు, సత్యనారాయణ, శివకృష్ణ, ,సునీత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

మధిర: ఆంధ్రాలోని తిరుమలగిరి గ్రామానికి ఉషారాణి.. తన మేనకోడలు అరుణ భర్త రమేష్ జ్ఞాపకార్థం, వారి కుమారుడు మనీష్‌రాజ్ పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో బుధవారం మధిరలోని మదర్ థెరిస్సా సేవాసదనం, మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్నదానం చేయడంతోపాటు 30 కేజీల బియ్యం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఉషారాణికి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

ఆర్థిక సాయం



మిత్రుడి కుటుంబానికి రూ.40 వేలు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తల్లాడ: స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు చేయూతగా నిలిచారు. తల్లాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1988–89 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఇటీవల మరణించిన తన తోటి మిత్రుడు దగ్గుల జితేందర్‌రెడ్డి కుటుంబానికి బుధవారం రూ.40,000లు ఆర్థిక సాయం అందజేశారు. ముందుగా మృతుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మొక్కా రాంబాబు, దగ్గుల కరుణాకర్‌రెడ్డి, గుడిపల్లి నారాయణ, పోలూరి నాగేశ్వర్‌రావు, కళ్యాణపు సంపత్‌కుమార్, నంబూరి శ్రీనివాసరావు, వరపర్ల రాంబాబు, బండారు జనార్దన్‌రావు, ఎస్.శ్రీనివాసరావు, కె.అప్పారావు, షేక్ జానీపాషా, పి.నాగయ్య, డిఎస్.రెడ్డి, కె.శ్రీనువాసరావు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. మండల పరిధిలోని వందనం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ సహకారంతో అవసరాలు కల్గిన దివ్యాంగ పిల్లలకు బుధవారం ఫిజియోథెరపీ వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో పాక్షిక పక్షవాతం, ఇతర శారీరక అంగవైకల్యం కల్గిన పిల్లలకు ఉచితంగా ప్రత్యేకంగా ఫిజియోథెరపీ సేవలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేవస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, తదితరులు పాల్గొన్నారు.

1న విగ్రహావిష్కరణ..

మధిర: మండలంలోని మహదేవపురం గ్రామంలో వచ్చే నెల ఒకటిన శ్రీ అభయాంజనేయస్వామి వారి 15 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవాలయ నిర్వాహణ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 6 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, శ్రీమత్ రామయాగం, సామూహిక కుంకుమార్చన ఉంటాయని పేర్కొన్నారు. అలాగే శనివారం ఉదయం 9 గంటలకు విశ్వక్సేన పూజ, స్వామికి అభిషేకం, పహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'కాకతీయ షుగర్స్'ను సందర్శించిన విద్యార్థులు



కల్లూరు కాకతీయ షుగర్స్‌ను సందర్శిస్తున్న విద్యార్థులు

కల్లూరు: కల్లూరులోని శ్రీ కాకతీయ షుగర్స్ అండ్ సిమెంట్ ఇండస్ట్రీస్‌ను బుధవారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులు సందర్శించారు. సేద్య విభాగంలో, జీపీబీఆర్ జన్యు మరియు వృక్ష ప్రజన విభాగంలో భాగంగా డాక్టర్ కె.నాగాంజలి, డాక్టర్ పి.ఝాన్సీరాణిల ఆధ్వర్యంలో వ్యవసాయ ఆధారిత ప్రోసెసింగ్ యూనిట్స్ సందర్శనలో భాగంగా కల్లూరు షుగర్ ఫ్యాక్టరీని, గంగారంలోని కేశవ సీడ్స్ ప్రోసెసింగ్ యూనిట్లను విద్యార్థులు సందర్శించారు. కాకతీయ షుగర్ ఇండస్ట్రీస్‌లో చెరకు గడల నుంచి చెక్కెర తయారు చేయడం మరియు దాని నుంచి వచ్చే ముడి సరుకులు బాగాస్సే, మొలాసిస్, ఫిల్టర్ మడ్, వాటిని వేరు చేసి మరలా ఎలా ఉపయోగించుకుంటారనేది కన్నారావు వివరించారు. తర్వాత గంగారంలోని కేశవ సీడ్స్ యూనిట్ సీడ్స్‌ను సందర్శించారు. విత్తన ప్రాసెసింగ్ గురించి, స్వచ్ఛమైన విత్తన తయారి గురించి చినబాబు వివరించారు. కార్యక్రమంలో షేక్ అస్లామ్, డాక్టర్ కె.శిరీష, చరిత, ఏఈఓ ఆశాజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కారుణ్య కుటుంబానికి అండగా ఉంటాం

కొణిజర్ల: ఈ నెల 24న భద్రాచలం నర్సింగ్ కళాశాలలో అనుమానస్పదంగా మృతి చెందిన కొణిజర్ల మండలం సిద్దిక్‌నగర్ గ్రామానికి చెందిన నర్సింగ్ విద్యార్థిని పగిడిపల్లి కారుణ్య కుటుంబానికి కాంగ్రెస్ దళిత విభాగం అండగా ఉంటుందని టీపీసీసీ ఎస్సీ విభాగం ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ దర్జీ చెన్నారావు అన్నారు. బుధవారం ఆయన కారుణ్య కుటుంబ సభ్యులను సిద్దిక్‌నగర్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా కారుణ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

31 నుంచి హనుమాన్ జయంతి వేడుకలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని వేంసూరురోడ్ శ్రీమెట్టాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 31వ తేదీ నుంచి ఒకటి వరకు హనుమాన్ జయంతి మహోత్సవాలు నిర్వహించబడతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. 31న స్వామికి 108 కలశాలతో అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు, 1న సహస్రనామ పారాయణ సహితంగా భక్తులచే తమలపాకుల పూజలు, సింధూర పూజలు నిర్వహించబతాయని తెలిపారు. అదే విధంగా మహాఅన్నదానం నిర్వహించడం జరుగుతుందన్నారు. బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణలను ఆలయ కమిటీ నిర్వాహకులు కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు.

శ్రీరామకోటి మహాస్తూపం..

శ్రీ కోదండ సీతారామలక్ష్మణ సమేత మెట్టాంజనేయస్వామి ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యాన శ్రీరామకోటి మహాస్తూపం నిర్మించబడుతుందని తెలిపారు. భక్తితో రామకోటి రాసే భక్తులకు హనుమత్ జయం తినాడు పుస్తకాలు ట్రస్ట్‌వారిచే అందించబడతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు కాలిలేని కాంతారావు, మల్లూరి అంకమరాజు, మందపాటి రవీందర్‌రెడ్డి, వెంకటరమణ, చెన్నయ్య, జి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తెలిపారు.

నేడు లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

కారేపల్లి: మండలంలోని తొడితలగూడెం గ్రామ శివారులో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో గురువారం నిర్వహించే స్వామి కల్యాణానికి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం స్వామికి పంచమృతాభిషేకములు, కల్యాణ మంగళస్నానము, కల్యాణ తిలకోద్ధరణ, ధ్వజారోహణము, నక్షత్ర ఆరాధన హారతి వంటి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం మహా అన్నదానం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణానికి భక్తులు అధిక హాజరు కావాలని కోరారు.

తుళ్లూరి ప్రసాద్ సేవలు చిరస్మరణీయం

సత్తుపల్లిటౌన్: సీనియర్ నాయకులు తుళ్లూరి ప్రసాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. బుధవారం సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్‌లో తుళ్లూరి ప్రసాద్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రటానికి తుమ్మల యుగంధర్‌తో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చలసాని సాంబశివరావు, చల్లగుళ్ల నర్సింహారావు, పుసులూరి హనుమంతురావు, చలసాని హరీష్, హరికృష్ణ, జూపాటి పాపారావు, గిరి, గోపి, నరుకుళ్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలి



పెనుబల్లి: మాట్లాడుతున్న నరసింహారావు

పెనుబల్లి: రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు యూ.నరసింహారావు డీలర్లకు సూచించారు. బుధవారం పెనుబల్లి రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని, నాసిరకం విత్తనాలను పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల కూడా అపోహలను నమ్మొద్దన్నారు. ఈ సందర్భంగా ఎస్సై కె.వెంకటేష్ మాట్లాడుతూ.. రైతు క్షేమంగా ఉంటేనే మనందరం క్షేమంగా ఉంటామని, డీలర్లు నాశిరకం విత్తనాలను అమ్మొద్దని, మేలైన విత్తనాలనే రైతులకు అందజేయాలని, బిల్లులు తప్పని సరిగా ఇవ్వాలని, తక్కువ ధరకు ఇస్తామని ఇండ్ల వద్దకు వస్తే వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని, వెంటనే సంబంధిత అధికారులతో పాటు, పోలీసు వారికి కూడా సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రసాద్‌రాజు, మండలంలోని డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి ..

తల్లాడ: గ్రామాల్లో రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నకిలీ విత్తనాలు అమ్మే అవకాశం ఉందని, దీనిపై ప్రభుత్వం నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్ అన్నారు. తల్లాడలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విత్తనాల చట్టాల్లోని లోపాలను ఆసరాగా చేసుకొని నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారని, విత్తనాల ద్వారా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

ఏన్కూరు: నకిలి విత్తనాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వైరా ఏడీఏ కరుణశ్రీ తెలిపారు. బుధవారం మండలంలోని బురద రాఘవాపురం, ఏన్కూరు, తిమ్మారావుపేటలో విత్తన దుకాణాలను టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, లైసెన్సులు, స్టాక్‌బోర్డు పరిశీలించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ.. పత్తి విత్తనాలను తగిన వర్షం 60 మీమీ పడిన తరువాత విత్తుకోవాలన్నారు. లైసెన్స్ కల్గిన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి బిల్లులు భద్రపరుచుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తుల ఎవరైనా కనిపిస్తే.. వెంటనే పోలీసులు, వ్యవసాయాధికారులకు తెలియజేయలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బాదవత్ రవి, వ్యవసాయాధికారి నర్సింహారావు పాల్గొన్నారు.

కప్పలబంధంలో..

కల్లూరురూరల్: మండలంలోని కప్పలబంధంలో బుధవారం వ్యవసాయశాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కప్పలబంధంలోని సదాశివ ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, శ్రీశ్రీనివాస ట్రేడర్స్, వేంకటేశ్వర ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపులను కల్లూరు వ్యవసాయ శాఖ అధికారి ఎం .రూప, ఎస్సై షాకీర్ తనిఖీ చేశారు. ఈ షాప్‌లకు వచ్చిన స్టాకు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, లైసెన్సులు పరిశీలించారు.

ముదిగొండలో..



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ రాధ

ముదిగొండ: మండలంలోని పలు విత్తనాలు, ఎరువులు విక్రయించే దుకాణాలను బుధవారం ఏఓ రాధ తనిఖీ చేశారు. పత్తి విత్తనాల ప్యాకెట్లు, బిల్లులు, రికార్డులను ఆమె పరిశీలించారు. విత్తనాలు విక్రయించిన ప్రతి రైతు వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

జీలుగు విత్తనాలు పంపిణీ



ఎర్రుపాలెం: మీనవోలులో.. జీలుగులు పంపిణీ చేస్తున్న ఏఓ విజయభాస్కరరెడ్డి



కొణిజర్ల: పంపిణీ ప్రారంభిస్తున్న వైరా ఏడీఏ కరుణశ్రీ

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు, ఎర్రుపాలెం, పెద్దగోపవరం, తక్కెళ్లపాడు, రాజుపాలెం, అయ్యవారిగూడెం సొసైటీ కార్యాలయంలో బుధవారం సబ్సిడీ ధరపై రైతులకు వ్యవసాయాధికారులు జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ.. పచ్చిరొట్టతో పొలాలకు సేంద్రియ ఎరువు సమకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు బాలకృష్ణ, జిష్ణు, ధాత్రి, సుష్మ, కృష్ణకుమారి, దుర్గాప్రసన్న, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బోనకల్: మండలంలోని కలకోట సహకార సంఘంలో రైతులకు జీలుగు విత్తనాలను మండల వ్యవసాయాధికారి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట ఇచ్చే మొక్కలను పెంచి నేలలో కలియదున్నడం ద్వారా నేలకు పోషకాలు అందుతాయి. ఈ కార్యక్రమంలో ఏఈఓలు నాగసాయి, త్రివేణి, కల్యాణి, సాధన తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్లలో..

కొణిజర్ల: మండలంలో సబ్సిడీపై జీలుగులు, జనుము విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని వైరా ఏడీఏ కరుణశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పచ్చి రొట్ట విత్తనాల వల్ల భూసారం పెరగడంతో పాటు రైతులకు ఎరువులు వేసే ఖర్చుకూడా తగ్గుతుందన్నారు. కొణిజర్ల మండలానికి 48 టన్నుల జీలుగలు, 10 టన్నుల జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అవసరమైతే అదనంగా విత్తనాలు తెప్పించడానికి కూడా అవకాశం ఉందన్నారు. రైతులు తమ గ్రామాలకు కేటాయించిన ఏఈఓ వద్ద ఆన్‌లైన్ కూపన్లు తీసుకుని సొసైటీ కార్యాలయంలో విత్తనాలు నగదు చెల్లించి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ బాలాజీ, సొసైటీ సీఈఓ వెంకటేశ్వర్లు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు జీలుగులు పంపిణీ..

ఏన్కూరు: స్థానిక సొసైటీ కార్యాలయంలో గురువారం జీలుగులు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి నర్సింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగులు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు మరియు పట్టాదారు పాసు పుస్తకం తీసుకొని ఏఈఓ వద్ద కూపన్ తీసుకొని రావలసిందిగా కోరారు. 30 కేజీల బస్తా రూ.1,116కు అందజేయనున్నట్లు తెలిపారు.

పంట కాల్వల మరమ్మతులు చేపట్టాలి



సోమవరం మైనర్ కాల్వ వద్ద రైతు సంఘం నాయకులు

వైరా: పంట కాల్వల పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రతిపాదిక మొదలుపెట్టి చివరి ఆయకట్టు భూములకు కూడా నీరందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం నాయకులు సోమవరం మైనర్ పంట కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్లగా సోమవరం మైనర్ కాల్వను అధికారులు పట్టించుకోక పోవడంతో పంట కాల్వ ఆనవాళ్లు లేకుండా పోయిందన్నారు. తూములు ధ్వంసమై నీరు వృధాగా పోయే అవకాశం ఉందన్నారు. అధికారులు ప్రత్యేక నిధులు కేటాయించి కాల్వ పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతనిప్పు చలపతిరావు, సుంకర సుధాకర్, హరి వెంకటేశ్వరరావు, సంక్రాంతి నరసయ్య, చెరుకుమల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజులు నియంత్రించాలి



ముదిగొండ: తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తల్లాడ/ముదిగొండ: ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయకుండా నియంత్రించాలని కోరుతూ.. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం తల్లాడ, ముదిగొండ తహసీల్దార్లు రవికుమార్, కరుణాకర్‌రెడ్డి లకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పానుకుల సుధాకర్, వైరా డివిజన్ అధ్యక్షుడు పుప్పాల నాగరాజు మాట్లాడుతూ.. అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు 25శాతం ఉచితవిద్యను అందించాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బోళ్ల నాగరాజు, బోడ వెంకట్, నాయకులు చరణ్, జాకీర్‌హుస్సేన్, నాగ చైతన్య, బ్రహ్మచారి, రవీందర్, గురు, ఎస్ఎస్ఐ ఉపాధ్యక్షుడు అజయ్, హేమంత్ పాల్గొన్నారు.